క్లుప్తంగా

మెరుగైన వైద్యసేవలు అందించాలి


రికార్డులను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఉదయగిరి: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు రమేష్, సహన సూచించారు. గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుడినరవ ఆరోగ్య ఉపకేంద్రాన్ని గురువారం వారు తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంల రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఉపకేంద్రం పరిధిలో క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు అందుతున్న వైద్యారోగ్య సేవలపై ఆరాతీశారు. వైద్యాధికారిణి ఎం శివకల్పన, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్ చెన్నయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు జ్యోతి, మెర్సీ, జమాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా విగ్రహ ఏర్పాటుకు చర్యలు

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలో కాపునేత వంగవీటి రంగా విగ్రహ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పట్టణానికి చెందిన కాపు నేతలతో కలిసి ట్రంక్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి సమీపంలో వంగవీటి రంగా విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాపు నేతగానే కాకుండా ప్రజానేతగా గుర్తింపు పొందిన వంగవీటి రంగా విగ్రహ ఏర్పాటు పనులను వీలైనంత త్వరగా ప్రారంభిస్తామని తెలిపారు. ట్రంక్ రోడ్డులో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా అధికారులతో చర్చించి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మేకపాటికి సన్మానం



వింజమూరు(ఉదయగిరి): వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని ఆయన నివాసంలో వింజమూరుకు చెందిన నేతలు, కార్యకర్తలు గురువారం కలిశారు. సెంట్రల్ బ్యాంక్ డైరెక్టరు మద్దూరి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజగోపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. పార్టీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

ఆత్మకూరు: పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదానం చేశారు.

అల్లూరు: స్థానిక ఆర్‌ఐ రోడ్డులోని టీడీపీ కార్యాలయ ఆవరణలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఉదయగిరి: ఉదయగిరి నియోజవర్గంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వరికుంటపాడులో ఎన్టీఆర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. దుత్తలూరు, ఉదయగిరిలో టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. వింజమూరులో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆటోను ఢీకొన్న బైక్

• ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: ఆటోను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడిన ఘటన గొలగమూడి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గొలగమూడి నుంచి నెల్లూరు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొంది. ఘటనలో రాకేష్, నవదీప్ గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరుకు స్థానికులు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోమపోటుతో పంటలకు నష్టం

ఇందుకూరుపేట: దోమపోటుతో పంటలకు నష్టం జరిగి దిగుబడి తగ్గిపోతోందని, నివారణకు తగు చర్యలు చేపట్టాలని డీడీఏ శివనారాయణ సూచించారు. గురువారం ఇందుకూరుపేటలో డీఆర్సీ ఏడీఏ మారుతిదేవి, వ్యవసాయ పరిశోధన కేంద్ర, నెల్లూరు శాస్త్రవేత్త పరమశివం పర్యటించారు. దోమ సోకిన వరి పంటను పరిశీలించి సుడి దోమ లక్షణాలు, నివారణ చర్యలను రైతులకు వివరించారు. స్థానిక ఏడీ రాజ్‌కుమార్, ఏఓ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి వారే

- తెలుగు తమ్ముళ్లలో వర్గపోరు
- ఎన్టీఆర్ వర్ధంతి వేదికగా బట్టబయలు
- మూడు వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు


చేజర్ల మండలం నాగులవెలటూరులో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న ఆనం వర్గం

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్యన వర్గపోరు నడుస్తోంది. గురువారం టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా తెలుగు తమ్ముళ్లలోని వర్గపోరు మరోసారి బట్టబయలైంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కలిసికట్టుగా కార్యక్రమాలు నిర్వహించాల్సిన వారు మూడు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే అన్నట్లుగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఆ పార్టీ కౌన్సిలర్ గౌస్‌బాషా బీఎస్సార్ సెంటర్‌లోని తన దుకాణం ఎదుట ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత గూటూరు కన్నబాబు వర్గీయులు మాత్రమే పాల్గొన్నారు. మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వర్గీయులు హాజరుకాలేదు. వారు వేరుగా మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. చేజర్ల మండలంలో టీడీపీ నాయకులు మూడు వర్గాలుగా విడిపోయి ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. మాజీ మంత్రి ఆనం వర్గంగా చెప్పుకునే వేలూరు కేశవ చౌదరి తన స్వగ్రామమైన నాగలవెలటూరులో ఎన్‌టీఆర్ వర్ధంతిని నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు తమ సామాజిక వర్గానికి చెందిన కొద్ది మంది గ్రామస్థాయి నాయకులతో కొట్టాలులో నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గూటూరు మురళీకన్నబాబు చేజర్లలో టీడీపీ నాయకుడు రావి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ తక్కువ మంది కార్యక్రమానికి హాజరుకావడంతో ఆయన అసహనం వ్యక్తం చేస్తూ కొద్దిసేపటికే వెనుదిరిగి వెళ్లినట్లు సమాచారం. టీడీపీ గడ్డు కాలంలో ఉన్నా పట్టించుకోకుండా మూడు వర్గాలుగా విడిపోయి నాయకులు ఎన్‌టీఆర్ వర్ధంతిని నిర్వహించి అభాసుపాలవడంపై తీవ్ర ఆవేదన చెందిన కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాలకు దూరంగా ఉండిపోయారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన కొద్దికాలంలోనే ప్రజలతో మమేకమవుతూ కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాబోయే ఎన్నికల్లో విక్రమ్‌రెడ్డిని ఢీకొనేందుకు టీడీపీలోని అన్ని వర్గాలను కలుపుకొని పోవడం అసాధ్యమని తెలుసుకున్న టీడీపీ టికెట్ ఆశిస్తున్న ఆనం ముఖం చాటేశారనే గుసగుసలు తెలుగు తమ్ముళ్ల నుంచి వినిపిస్తున్నాయి.

బావపై కత్తితో దాడి


గాయపడిన శ్రీనివాసులును ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

సోమశిల: బావపై బావమరిది కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన అనంతసాగరం బస్టాండ్ సెంటర్‌లో గురువారం చోటు చేసుకుంది. వివరాలు..సంగం మండలం జెండాదిబ్బ ఎస్టీ కాలనీకి చెందిన కటారి శ్రీనివాసులు, దొడ్ల పెంచలయ్యలు బావమరుదులు. వారు చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిత్త కాగితాలు సేకరించుకుంటూ ఇరువురు నాలుగు రోజుల క్రితం అనంతసాగరం వచ్చారు. గురువారం వారి మధ్యన చిన్నపాటి విషయమై ఘర్షణ నెలకొంది. ఈ క్రమంలో పెంచలయ్య కత్తితో దాడి చేయగా శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ప్రభుత్వ వైద్యశాలలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీ



సంగం : మండలంలోని వెంగారెడ్డిపాళెంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకున్న 15 మందికి కళ్ల అద్దాలు అందజేశారు. వలంటీర్లు శరవణ, ప్రదీప్, హేమలత, పవిత్ర, భవ్య, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడికి స్వల్ప అస్వస్థత


చికిత్స పొందుతున్న క్రీడాకారుడు మల్లికార్జున

కలిగిరి: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో ఓ క్రీడాకారుడు గురువారం స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. కలిగిరి–1, గుడ్లదొన జట్ల మధ్యన జరిగిన మ్యాచ్‌లో కలిగిరి క్రీడాకారుడు గోసాల మల్లికార్జున్ కూతకు వెళ్లిన సమయంలో పట్టుకునే క్రమంలో క్రీడాకారులు ఒక్కసారిగా పైనపడడంతో ఊపిరి ఆడక అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే సహచర క్రీడాకారులు కలిగిరిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స అందించారు. మల్లికార్జునను ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి చెంచుకృష్ణారెడ్డి పరామర్శించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మల్లికార్జున వైద్యశాల నుంచి ఇంటికెళ్లాడు.

22కు అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు వాయిదా

ఆత్మకూరు: ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఖాళీల భర్తీకి శుక్రవారం నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయని సీడీపీఓ పీ సునీలత గురువారం తెలిపారు. అనివార్య కారణాలతో ఇంటర్వ్యూలను వాయిదా వేశామని, అభ్యర్థులు గమనించాలన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల 22న మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

రేపు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

వింజమూరు(ఉదయగిరి): ఐసీడీఎస్ వింజమూరు ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ పద్మజాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలిగిరి మండలం రాజుపాళెం, వీర్నకల్లు మెయిన్, జలదంకి మండలం తిమ్మసముద్రం అంగన్‌వాడీ కేంద్రాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 10 గంటలకు కావలి ఆర్డీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు వాయిదా

ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి మండలాల్లోని ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆత్మకూరులోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడినట్లు సీడీపీఓ పచ్చవ లావణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఇంటర్వ్యూలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించి సహకరించాలని కోరారు.

వివాదాస్పద భూములకు పట్టాల ప్రతిపాదనలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం శంఖవరంలో సర్వే నంబరు 208లోని వివాదాస్పద భూములను పలువురికి కట్టబెట్టేందుకు తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ భూమిపై 145 సెక్షన్ అమల్లో ఉంది. గతంలో ఈ భూములను పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులు ప్రయత్నించిన గ్రామ ఉమ్మడి అవసరాలకు కోసం ఉంచాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ భూముల్లోకి ఎవరూ ప్రవేశించకుండా 145 సెక్షన్ అమలు చేసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుత తహసీల్దార్ రవీంద్రబాబు మరో నాలుగు రోజుల్లో బదిలీ అవుతున్న నేపథ్యంలో పెద్ద మొత్తంలో లంచం తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా పెద్దలకు భూమిని కట్టబెట్టేందుకు పట్టాల ప్రతిపాదనలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రవీంద్రబాబును ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

కుష్ఠుపై అప్రమత్తంగా ఉండాలి

కొడవలూరు: కుష్ఠు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని లెప్రసీ కంట్రోల్ సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ నరసారెడ్డి సూచించారు. కొడవలూరులోని మూలకట్ల గిరిజన కాలనీలో లెప్రసీ సర్వేను గురువారం నిర్వహించారు. అనుమానిత లక్షణాలున్న పలువుర్ని పరీక్షించారు. ఒకరికి నిర్ధారణ కావడంతో మందులు అందజేసి వైద్య సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుష్ఠును ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నివారించొచ్చని చెప్పారు. రాగి వర్ణపు, స్పర్శలేని మచ్చలుంటే అనుమానిత లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్‌ఎంలు శేషుబాయి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

కలిగిరి: లక్ష్మీపురం గ్రామ సచివాలయం పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి బీ గీతారెడ్డి గురువారం తెలిపారు. వైద్య నిపుణులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువుల పాక, గడ్డివామి దహనంపై ఫిర్యాదు

కలిగిరి: తన పశువుల పాక, వరిగడ్డి వామిని బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారని తెల్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన కూనిపోగు ఇర్మియా గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల కాలనీకి చెందిన కూనిపోగు పోలు తన వరి పొలంలో పశువులను తోలి నాశనం చేయడంతో ప్రశ్నించామన్నారు. ఈ విషయమై రెండ్రోజుల క్రితం చెన్నై నుంచి వచ్చిన పోలు కుమారుడు ప్రవీణ్ తమను నానాదుర్భాషలాడారని ఆరోపించారు. పాత గొడవలను మనస్సులో పెట్టుకుని గడ్డివామి, పశువుల పాకను వారే తగులబెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వలంటీర్లకు నియామక పత్రాలు

వరికుంటపాడు: మండలంలో నూతనంగా ఎంపికైన 17 మంది వలంటీర్లకు ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వహించాలని వలంటీర్లకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందేలా చూడాలన్నారు.


సామాజిక సాధికార బస్సు యాత్ర వాయిదా

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో శనివారం జరగాల్సిన సామాజిక సాధికార బస్సు యాత్రను వాయిదా వేసినట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలతో వాయిదా పడిన బస్సు యాత్రను త్వరలో నిర్వహిస్తామని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గమనించాలని కోరారు.

కుల గణన సర్వేకు సహకరించాలి

ఉదయగిరి: మండలంలోని సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి చేపడుతున్న కుల గణన సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో కోరారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ వివరాలు సేకరిస్తారని చెప్పారు. వారు సేకరించిన సమాచారాన్ని సిటిజన్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా మండలాధికారులు సచివాలయం పరిధిలో 200 ఇళ్లను సందర్శించి ధ్రువీకరణ చేస్తారని తెలిపారు.

మర్యాదపూర్వకంగా..



మర్రిపాడు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని బ్రాహ్మణపల్లిలోని ఆయన నివాసంలో మండల జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా


చేజర్ల: కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు


ఆత్మకూరు: కబడ్డీలో గెలుపొందిన వాశిలి జట్టును అభినందిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలను గురువారం నిర్వహించారు. సచివాలయాల స్థాయిలో ప్రతిభకనబర్చిన క్రీడాకారులు ఉత్సాహభరితంగా క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. బాలికల విభాగంలో కబడ్డీలో బట్టేపాడు జట్టుపై వాశిలి జట్టు, ఖోఖోలో బట్టేపాడు జట్టుపై వాశిలి జట్టు, వాలీబాల్‌లో బట్టేపాడు జట్టుపై మహిమలూరు జట్టు విజయం సాధించాయి. అలాగే బాలుర ఖోఖో మండల స్థాయి పోటీల్లో మహిమలూరు జట్టుపై బట్టేపాడు జట్టు విజయం సాధించింది. విజేతగా నిలిచిన జట్లను నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్ర పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత జట్లను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ బీ నాగేశ్వరరావు, పీడీ తిరుపతయ్య, ఈఓపీఆర్డీ ఉషారాణి, తదితరులు అభినందించారు.

మండల స్థాయి కబడ్డీ పోటీల విజేత కోటితీర్థం

చేజర్ల: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా చేజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న మండల స్థాయి కబడ్డీ పోటీల్లో కోటితీర్థం జట్టు విజేతగా నిలచింది. గురువారం జరిగిన ఫైనల్ పోటీలో పాడేరుపై కోటితీర్థం జట్టు 17 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఈ పోటీలను ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మల్లికార్జునరావు, ఈఓపీఆర్డీ రామయ్య, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో కాలువలో పూడికతీత



దగదర్తి (కావలి): దగదర్తి మండలం దామవరం పంచాయతీ పరిధిలోని నారాయణపురం గ్రామ రైతులకు సాగునీటిని అందించే కాలువలో పూడికతీత పనులను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులతో గురువారం ప్రారంభించారు. నారాయణపురంలోని సుమారు 400 ఎకరాలకు కావలి కాలువ నుంచి ఉపకాలువ ద్వారా సాగునీరు సరఫరావుతుంది. ఉపకాలువ పూడికతో నిండడంతో సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు, వైస్‌ఎంపీపీ వట్టికాళ్ల తిరుపతయ్య ఎమ్మెల్యే రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. శాఖాపరంగా పనులు చేపట్టేందుకు ఆలస్యమయ్యే పరిస్థితి ఉండడంతో తన సొంత నిధులతో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేత జట్టుకు షీల్డు అందజేస్తున్న ఎంపీపీ తూమాటి


ఆత్మకూరు: విజేతగా నిలిచిన ఎస్‌వీపీ జట్టు

చేజర్ల: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని యనమదలలో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన చేజర్ల రెడ్డీస్ యూత్‌కు కాంట్రాక్టర్ కేశవ చౌదరి రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన యనమదల జట్టుకు గోతం వెంకటసుబ్బయ్య రూ.10 వేలు నగదుతో పాటు షీల్డులను అందజేశారు. యనమదల సర్పంచ్ సుందరరామిరెడ్డి, ఉపసర్పంచ్ ప్రభాకర్‌నాయుడు, సచివాలయ కన్వీనర్ ఎన్ గోపాల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు టీ రవినాయుడు, వేణురెడ్డి, రమేష్, రవిరెడ్డి, గిరి, తిరుపతిరెడ్డి, సింహాద్రి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత ఎస్‌వీపీ జట్టు

ఆత్మకూరు: సంక్రాంతి సందర్భంగా పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జే ప్రణీత్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ దొరసానమ్మ మెమోరియల్ ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన ఎస్‌వీపీ జట్టుకు రూ.20 వేలు, రన్నర్‌గా నిలిచన ప్రశాంత్ జట్టుకు రూ.10వేలు నగదుతో పాటు షీల్డ్‌లను ఆత్మకూరు సీఐ జీ వేణు, డాక్టర్ జే ప్రణీత్ చేతుల మీదుగా అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకులు కే నవీన్, ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

• ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో గాయపడిన ఆటో డ్రైవర్ రఘు

సంగం: ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని గాంధీజనసంఘం వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. సంగంలోని వడ్డిపాళేనికి చెందిన రఘు తన ఆటోలో బుచ్చిరెడ్డిపాళెం వెళ్లి తిరిగి వస్తుండగా ర్యాంపు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కాగా సంగానికి చెందిన ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గొబ్బెమ్మల ఉత్సవం



మనుబోలు: మండలంలోని జట్లకొండూరులో గొబ్బెమ్మల గ్రామోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గొబ్బెమ్మను ఉంచి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున ధూపదీప నైవేద్యాలతో గొబ్బెమ్మకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉపసర్పంచ్ ఆవుల తులసీరామ్ కుటుంబ సమేతంగా పూజలకు హాజరయ్యారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గొబ్బెమ్మను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలోని వీధుల మీదుగా ఉత్సవాన్ని నిర్వహించారు.

పొదుపు గ్రూపులకు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న వెంకటస్వామి

కోవూరు: మండలంలో పొదుపు గ్రూపు సభ్యులకు పొదుపు పథకాలపై మరింత అవగాహన కల్పించేలా వీఓఏలు ప్రత్యేక చొరవ చూపాలని వెలుగు ఏపీఎం వెంకటస్వామి పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన వీఓఏలతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని స్థానిక సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొదుపు సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. పొదుపు గ్రూపుల రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. క్రమం తప్పకుండా పొదుపు సమావేశాలను నిర్వహించి ఆర్థిక లావాదేవీలపై సభ్యులతో చర్చించాలన్నారు. సీసీలు రాము, శౌరి, వసంత తదితరులు పాల్గొన్నారు.